విద్యుత్ లైన్ ఏర్పాటుకు సర్వే

వాజేడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో చెరుకూరు, చింతూరు, అయ్యవారి పేట, ధర్మవరం, పేరూరు పంచాయతీలలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం సర్వే నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల పూడి విక్రాంత్ వర్మ ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటించి విద్యుత్ లైన్‌లు లేని వీధుల్లో విద్యుత్ శాఖ అధి కారులతో కలిసి పరిశీలించారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు నిధుల నుంచి వి ద్యుత్ లైన్‌ల కోసం నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఏఈ అర్షద్, నాయకులు రమేష్, ఖాజావలి, కృష్ణమూర్తి, పగిడయ్య, రఘుపతి, ఎర్రబాబు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థను పరిరక్షించుకోవాలి

- హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్
- వర్చువల్‌గా కోర్టు భవనానికి శంకుస్థాపన
- హాజరైన న్యాయమూర్తులు వేణుగోపాల్, రాజేశ్వర్‌రావు



భూపాలపల్లి కోర్టు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు వేణుగోపాల్, రాజేశ్వర్‌రావు

కృష్ణకాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం అందించడమే కర్తవ్యంగా న్యాయస్థానాలు పనిచేస్తున్నాయని హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. న్యాయ వ్యవస్థను పరిరక్షించుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్మించనున్న కోర్టు భవన సముదాయానికి వర్చువల్‌గా ఆయన హైదరాబాద్ నుంచి శనివారం శంకుస్థాపన చేశారు. ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఈ కార్యక్రమం జరగ్గా హైకోర్టు జడ్జిలు ఈవీ వేణుగోపాల్, ఎన్.రాజేశ్వరరావు నేరుగా హాజరయ్యారు. అనంతరం భూపాలపల్లిలోని కృష్ణకాలనీలో కోర్టు నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో సర్వమత ప్రార్థనల నడుమ ఇద్దరు జడ్జిలు శంకుస్థాపన చేశారు. జిల్లాకు వచ్చిన న్యాయమూర్తులు వేణుగోపాల్, రాజేశ్వరరావుకు భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్ బాబు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఘనంగా స్వాగతం పలికారు. వర్చువల్ కార్యక్రమంలో చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాకు పక్కా భవన సముదాయం మంజూరు కావడం ఆనందించదగ్గ విషయమన్నారు. కొత్త భవనం ఏర్పాటుతో కక్షిదారులకు, న్యాయవాదులు, సిబ్బందికి మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కోర్టు భవనాలు న్యాయ దేవాలయాలు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడి ఎ.నాగరాజ్, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు (మిగతా 8వ పేజీలో)



ములుగులో పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు జడ్జిలు, అధికారులు

ఇప్పటికైనా కదిలేనా!?





అక్టోబరు 29న మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో నగరాన్ని ముంచెత్తిన వరద నీరు (ఫైల్)

ప్రతీ ఏటా వర్షాకాలంలో చారిత్రక వరంగల్ నగరం వరదల బారిన పడి అల్లాడుతోంది. చిన్నపాటి వానలకే అనేక చోట్ల వరద పోటెత్తుతోంది. ప్రధాన రహదారులు గోదారులుగా మారుతున్నాయి. కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకుంటుండటంతో జనం చెప్పలేని కష్టాలకు గురవుతున్నారు. గత కొన్నేళ్లుగా నగరంలో చెరువులు, నాలాలు యథేచ్ఛగా కబ్జాల బారిన పడుతుండటమే ఇందుకు కారణం. మురికి కాలువ పక్కన ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. కబ్జారాయుళ్లు దర్జాగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు ప్రశ్నిస్తే, చేతులు తడిపి మేనేజ్ చేసుకుంటున్నారు. కబ్జాల వల్ల నగరంలోని 170 చెరువుల్లో సగం మాయమయ్యాయి. నగర పరిధిలో 16.42 కి.మీ. పొడవున్న నాలుగు ప్రధాన నాలాలను ఇరువైపులా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేశారు. దీంతో చిన్నపాటి వానకు కూడా నగరంలో జల విలయం సంభవిస్తోంది. ఇటీవలి మొంథా తుపాను వల్ల వరంగల్ నగరం జల కల్లోలం బారిన పడిన నేపథ్యంలో.. గత శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా నాలాలు, చెరువుల అక్రమణలను ఉపేక్షించవద్దని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఇప్పటికైనా అధికారుల్లో కదలిక వచ్చేనా..? అక్రమణలు తొలగేనా..? అనే చర్చ సాగుతోంది.

ఓరుగల్లులో చెరువులు, నాలాల కబ్జాలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలన్న సీఎం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణకు రెండో రాజధానిగా చెప్పుకుంటున్న వరంగల్ మహానగరంలో ఖాళీ జాగా కనిపిస్తే కబ్జాలు జరుగుతున్నాయి. గ్రేటర్ పరిధిలో 170 చెరువులు, కుంటలు ఉన్నట్లుగా ఇటీవల అధికారులు గుర్తించారు. వీటిలో 80కి పైగా కుంటలు, చెరువులు వాటి స్వరూపాన్ని కోల్పోయాయి. మిగిలిన వాటిల్లో నగరం నడిబొడ్డున ఉన్న నాలుగు ప్రధాన జలాశయాల్లో ఒకటైన భద్రకాళి చెరువు 495.89 ఎకరాల్లో విస్తరించింది. 180 ఎకరాలకుపైగా చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైందని అంచనా. చెరువు చుట్టూ 249 అక్రమ కట్టడాలను నిర్మించారు. వీటిలో 108 అక్రమ కట్టడాలను ఇటీవల కూల్చివేయగా, మిగతా నిర్మాణాలపై చర్యలకు రాజకీయ ఒత్తిళ్లు (మిగతా 7వ పేజీలో)

- నగరంలో 170కి పైగా చెరువులు, కుంటల్లో సగం మాయం
- భద్రకాళి, బంధం, కోట, చిన్నవడ్డెపల్లి చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో 1,094 అక్రమ కట్టడాల గుర్తింపు
- మురికి కాలువలను సైతం వదలని అక్రమార్కులు.. 524కు పైగా అక్రమ నిర్మాణాలు
- నాలా స్థలాల్లో విద్య, వైద్య సంస్థలు, షాపింగ్‌మాల్స్, ఫంక్షన్‌హాల్స్, షాపులు
- చెరువులు, నాలాల ఆక్రమణలతో కాలనీల్లోకి వరదనీరు
- ఆక్రమణలపై ఉపేక్షించవద్దన్న ముఖ్యమంత్రి
- సీఎం ఆదేశాలతో అధికారుల్లో చలనంపై ఆశలు



గోపాల్‌పూర్ కాలనీలో ప్రజలను పడవపై సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

మేడారంలో చురుగ్గా 'పునరుద్ధరణ'

తాడ్వాయి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క- సారలమ్మల దేవస్థానం పునరుద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వందల ఏళ్ల శాశ్వతంగా నిలిచేలా వీటిని చేపడుతున్నారు. ఆలయ పునాది పనులు చివరి దశకు చేరుకున్నాయి. బేస్‌మెంట్ నుంచి రాతి కట్టడాల వరకు పనులు ఉన్నా



వేగంగా కొనసాగుతున్న దేవస్థానం పునాది పనులు

చివరి దశకు చేరుకున్న పునాది పనులు

యని, ఇప్పటికే చాలావరకు గ్రానైట్ కటింగ్ జరిగిందని అధికారులు, కాంట్రాక్టర్లు తెలిపారు. జాతరకు ముందుగానే పనులు పూర్తి చేస్తామని వారు అంటున్నారు.

సీసీ పనులు పరిశీలన

మహాజాతరలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను పంచాయరాజ్ ఇంజనీరింగ్ డీఈ ధర్మేందర్ శనివారం తిరిగి పరిశీలించారు. మహాజాతరలో పూజారులు వనం తీసుకొచ్చే క్రమంలో ముఖ్యమైన రహదారి పనులకు ప్రభుత్వం రూ.. 1.30కోట్ల నిధులు మంజూరు చేయగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. వాటి నాణ్యత, పురోగతిని డీఈ పరిశీలించారు. ఆయన వెంట ఏఈ, జేఈ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య నిర్వహణ

మేడారంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. డీపీవో



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ

దేవరాజ్ ఆధ్వర్యంలో 18మంది శాశ్వత, 22మంది రోజువారీ కార్మికులతో 15 రోజులుగా పారిశుధ్య పనులు చేపడుతున్నారని గ్రామ కార్యదర్శి సతీష్ తెలిపారు. వనదేవతలను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులు పలు ప్రాంతాలు దేవస్థానం పరిసరాలు, మేడారం, రెడ్డిగూడెం గ్రామాలు, చిలకలగుట్ట, స్నానఘట్టాలు, జంపన్నవాగు పరిసరాలు, భక్తుల వసతి షెడ్లు, ప్రభుత్వ అతిథిగృహాలు, మహిళలు దుస్తువులు మార్చుకునే గదులు, ఆర్టీసీ బస్టాండ్, శివరాంసాగర్ పరిసరాలు, భక్తులు విడిది చేస్తున్న అటవీ ప్రాంతాలు, పార్కింగ్ (మిగతా 8వ పేజీలో)

కాళేశ్వరాలయంలో కార్తీక శోభ

- లక్ష వత్తులతో ప్రత్యేక పూజలు
- గోదావరి హారతిని నిర్వహించిన అర్చకులు

6లో..

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా కుర్రె ప్రవీణ్



భూపాలపల్లిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా కుర్రె ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి రాంబాబు ప్రకటించారు. శనివారం భూపాలపల్లిలో జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ప్రైవేటు డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమనాథుని రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్‌ను, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎల్.రమేష్‌నాయక్, ఆర్థిక కార్యదర్శిగా గణేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా రంగారావు, ఉపాధ్యక్షుడిగా నీలిమారెడ్డి, శిరీషను ఎన్నుకునానరు.

వరికి అగ్గి తెగులు

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- అకాల వర్షాల కారణంగా తీవ్ర నష్టం
- ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలతో సతమతం
- పైగా నిండా ముంచిన మొంథా

8



అగ్గి తెగులు సోకి రంగు మారుతున్న వరి పంట

ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబ కలహాలు..

- మానసిక వేదనతో ఎస్.బి.ఎస్సై హఫీసుద్దీన్ ఆత్మహత్య
- మరో నాలుగు నెలల్లో రిటైర్‌మెంట్ ఉండగానే తీవ్ర నిర్ణయం



హఫీసుద్దీన్ (ఫైల్)

నర్సంపేట టౌన్/చెన్నారావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఎస్.బి. ఎస్సై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వరంగల్ జిల్లాలోని నర్సంపేట పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. నర్సంపేట ఎస్సై అరుణ్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. నర్సంపేట పట్టణంలోని వల్లభ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఎమ్డీ. హఫీసుద్దీన్(60) స్పెషల్ బ్రాంచి ఎస్సైగా ఖానాపురం, చెన్నారావుపేట మండలాల్లో గత మూడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు, ఆర్థికపరమైన ఇబ్బందులతో కొంతకాలంగా ఆయన మానసికంగా కలత చెందుతున్నారు. ఈ సమస్యకు కుటుంబ కలహాలు తోడయ్యాయి. శుక్రవారం ఆయన యథావిధిగా విధులకు హాజరయ్యారు. డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత రాత్రి సమయంలో గడ్డి మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య నూర్జహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్టు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, ఇద్దరు కుమార్తెల వివాహమైంది. హఫీసుద్దీన్ ఆత్మహత్యతో పోలీసువర్గాల్లో విషాదం నెలకొంది. వరంగల్ రంగశాయిపేటకు చెందిన హఫీసుద్దీన్ 1984లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. అనంతరం ఎస్సైగా పదోన్నతి పొందారు. 2026 ఫిబ్రవరిలో ఆయన రిటైర్ కావాల్సి ఉంది.

భారీగా తగ్గిన బొగ్గు ఉత్పత్తి

భూపాలపల్లి ఏరియాలో 55 శాతమే..

కృష్ణకాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి భారీగా తగ్గింది. ఆశించిన స్థాయి కంటే సగానికి పడిపోయింది. గత నెలలో జరిగిన ఉత్పత్తి వివరాలను భూపాలపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ప్రకటించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 4.23 టన్నులు కాగా 2.33 టన్నులు సాధించినట్టు వివరించారు. టార్గెట్‌లో 55 శాతం పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. అలాగే, ఓబీ వెలికితతో 52.00 క్యూబిక్ మీటర్లకు 32.92 క్యూబిక్ మీటర్లతో 63 శాతం ఓవర్ బర్డన్ వెలికి తీసినట్లు తెలిపారు. 4.23 నుంచి 2.16 టన్నుల బొగ్గు రవాణా జరిగిందన్నారు. అధిక వర్షాల వల్ల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని, దీంతో లక్ష్యాల్ని చేరుకోలే కపోయామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేలా ప్రణాళికలు రూపొందించుకోనున్నట్లు తెలిపారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఇంటర్ కంపెనీ వేయిట్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్‌లో భూపాలపల్లి ఏరియాలోని పలువురు కార్మికులు పతకాలు సాధించారని, మిస్టర్ కోలిండియా టైటిల్‌ను కేటీకే 6ఇన్‌క్లైన్‌లో కోల్ కట్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి సాధించారని జీఎం వివరించారు.



జడ్జిలకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

రామప్పను సందర్శించిన హైకోర్టు జడ్జిలు

వెంకటాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలో ఉన్న యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జిలు ఈవీ.వేణుగోపాల్, నామవరపు రాజేశ్వర్‌రావు సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ఉమాశంకర్, హరీష్‌శర్మలు వారిని పూర్ణకుంభంతో స్వాగతించి పట్టువస్త్రాలతో సత్కరించారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ములుగు, భూపాలపల్లి జడ్జిలు సూర్యచంద్రకళ, రమేష్‌బాబు, ములుగు ఆర్డీవో వెంకటేష్, స్థానిక తహసీల్దార్ గిరిబాబు, సీఐలు సురేష్, శంకర్, ఎస్సై చల్ల రాజు, ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

వెంకటాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు వెంకటాపూర్ ఎస్సై చల్లా రాజు తెలిపారు. మండల కేంద్రంలోని తాళ్ళపాడు సెంటర్‌లో శనివారం సాయంత్రం పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యక్తి అనుమానస్పదంగా కనిపించగా వాహనం ఆపి తనిఖీ చేశారు. 2 కేజీల 166 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు ఆయన తెలిపారు. వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన ఎండీ.యాసిన్‌ఖాన్‌గా గుర్తించి అతడిపై కేసు నమోదు చేసి ములుగు జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

జీడికల్ జాతర ఏర్పాట్లు చేయాలి

● అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి ● ఆలయాభివృద్ధికి దాతలు ముందుకు రావాలి ● ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘణపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే విశిష్టత గల జీడికల్ శ్రీవీరాచల సీతారామచంద్రస్వామి కార్తీక మాస బ్రహ్మోత్సవ వేడుకల ఏర్పాట్లను అధికారులు బ్రహ్మాండంగా చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం లింగాలఘణపురం మండలం జీడికల్ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జీడికల్ ఆలయ పూర్వవైభవానికి కృషి చేస్తున్నానని, ఇందుకోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్‌ని కలిసి అసంపూర్తిగా ఉన్న ప్రాకార నిర్మాణం, భక్తుల వసతి కోసం ధర్మసత్రాల నిర్మాణం చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ఆలయాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ భక్తిభావంతో ముందుకు రావాలని ఇందుకోసం తన వంతుగా రూ. 2 లక్షల విరాళాన్ని వ్యక్తిగతంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. దాతలతోనే అభివృద్ధి మరింత పెరుగుతుందన్నారు. 4న జాతర ప్రారంభం కానుండగా 10న కల్యాణోత్సం జరుగుతుందని సుమారు 15వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల కోసం ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లను సైతం తాను అందించనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

వచ్చే శ్రీరామనవమి నాటికి బీటీ రోడ్డు నిర్మాణంతో పాటుగా సులభ్ కాంప్లెక్స్ తరహాలో మరుగుదొడ్ల నిర్మాణం శాశ్వత ప్రాతిపదికన చేపటనున్నట్లు తెలిపారు. వైద్యశిబిరం ఏర్పాటుతో పాటుగా అంబులెన్స్ సేవలు జాతర ముగిసే వరకు ఉండాలని అధికారులను సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు.

ముందుకొచ్చిన దాతలు..

ఎన్‌పీడీసీఎల్ ఎస్‌సీ వేణుమాధవ్ జీడికల్ మెయిన్ రోడ్ నుంచి మోత్కూర్ క్రాస్ రోడ్ వరకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి,



జాతర ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

పోరెడ్డి మల్లారెడ్డి ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున, వ్యవసాయమార్కెట్ మాజీ డైరెక్టర్ బుషిగంపల ఆంజనేయులు రూ.40వేలు, వ్యవసాయమార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్ రూ. 25వేలు, వేముల కృష్ణారెడ్డి రూ.20వేలు విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపీరామ్, ఆలయ ఈవో వంశీ, మిషన్‌భగీరథ ఈఈ శ్రీకాంత్, పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రావు, డీపీవో నవీన్, తహసీల్దార్ రవీందర్, ఎంపీవో రఘురామకృష్ణ, ఆలయ చైర్మన్ మూర్తి పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ధాన్యం కొనుగోలులో సర్కారు విఫలం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజం

పాలకుర్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్‌తో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణపురం గ్రామంలో రైతు పోగు అశోక్‌కు చెందిన వరి పంట నేల వాలడంతో దయాకర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత ఏడాది రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ పైసలు ఇంతవరకు ఇవ్వలేదని, ఇదే రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దుస్థితి అని ఎద్దేవా చేశారు. ధాన్యం నింపేందుకు గోనె సంచులు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు. మొంథా తుపాన్‌తో వరి, పత్తి, మొక్కజొన్నలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు డిమాండ్ చేశారు.



లక్ష్మీనారాయణపురంలో నేలరాలిన వరిపంటను పరిశీలిస్తున్న ఎర్రబెల్లి

నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25 వేల పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పసు నూరి నవీన్, మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, ఎఫ్ఎస్ఎస్‌సీఎస్ చైర్మన్ అశోక్ రెడ్డి, కారుపోతుల వేణు, మాచెర్ల ఎల్ల య్య, ముస్కు రాంబాబు, బొమ్మగాని కొంరయ్య, కత్తి సైదులు, మహేందర్ ఉన్నారు.

స్కూటీని ఢీకొన్న కారు

నలుగురికి గాయాలు

కృష్ణకాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శినవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన తౌనుప ప్రవీణ్ పక్కింటి ముగ్గురు చిన్నారులను స్కూటీ మీద స్కూలుకు తీసుకెళ్తున్న క్రమంలో మలుపు వద్ద వెనకాల నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో దీంతో స్కూటీపై ఉన్న చిన్నారుల్లో వైశాలి, రక్షితలకు తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో చిన్నారి ఆయేషాపాల్ పాటు స్కూటీ నడుపుతున్న ప్రవీణ్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ఆటోలో వంద పడకల ఆస్పత్రికి తరలించారు.

కౌలు రైతు పత్తి విక్రయించేదెలా?!

చిట్యాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తిని విక్రయించలేక ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని ఓ మిల్లులో ఇటీవల సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించింది. కౌలు రైతులు పత్తిని విక్రయించేందుకు వ్యవసాయ శాఖ ఆన్‌లైన్‌లో ఆప్షన్ పేర్కొనకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించి మద్దతు ధరను పొందే అవకాశం లేకపోవడంతో ప్రైవేటు విక్రయిస్తూ నష్టపోతున్నారు. చిట్యాల మండలంలో 14,200 ఎకరాల్లో రైతులు పత్తిపంట సాగు చేస్తున్నారు. తరచూ వర్షాలతో అన్నదాతలు అవస్థలు ఎదుర్కొంటుండగా పత్తిని విక్రయించేందుకు కౌలు రైతులకు ఆన్‌లైన్‌లో అవకాశం లేకపోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులకూ అవకాశం వస్తుంది

- శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి చిట్యాల

సీసీఐ కేంద్రంలో కౌలు రైతులు పత్తిని విక్రయించేందుకు అవకాశం వస్తుంది. స్థానిక సమస్యలను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే ఆన్‌లైన్ ఆప్షన్ వచ్చిన వెంటనే కౌలు రైతుల వివరాలు అప్‌డేట్ చేస్తాం.



ఉప్పుగల్లులో కోతకు గురైన వరి పంటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



సముద్రాలలో వరదనీటిలో మునిగిన పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలి

జఫర్‌గఢ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దం రాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల రాజు, పార్టీ జిల్లా నేత తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ, అనుబంధ సంఘాల ప్రతినిధులు ఉప్పుగల్లులో పంటనష్టంపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. దెబ్బతిన్న వరి, పత్తి, మొక్కజొన్న వంటి పంటలను పరిశీలించి బాధిత రైతులను పరామర్శించారు. ఎకరాకు రూ.30వేల చొప్పున పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయిని యాదగిరి, మూల యాకయ్య, పొను గోటి గోపాల్ రావు, పవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన బీజేపీ నాయకులు

● స్టేషన్‌ఘన్‌పూర్: వర్షంతో పంటలను కోల్పోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల నాయకులు కత్తుల రాజు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, రమేష్‌లు డిమాండ్ చేశారు. శనివారం సముద్రాలలో వరదతో నేలవాలి న పంటల్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. తుపాన్ బీభత్సంతో వందలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వాపోయారు. ప్రభుత్వం ప్రతీ ఎకరాకు రూ.50వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని కోరారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టొద్దు

పనులను అడ్డుకున్న ఛాగల్ గ్రామస్థులు

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఛాగల్‌లో హైవేపై ఏర్పాటు చేయనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను గ్రామస్థులు అడ్డుకున్న శనివారం అడ్డుకున్నారు. పనులు చేపట్టడానికి సిబ్బంది వచ్చారనే సమాచారంతో అక్కడికి చేరుకొని పనులను చేపట్టవద్దు వారించారు. దీంతో సిబ్బందికి, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ జి.వేణు ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడికి చేరుకొని కేంద్రం నుంచి మంజూరైన పనులను అడ్డుపడవద్దని, పనులు జరిగేలా సహకరించాలని సూచించారు. అందుకువారు ససేమిరా అన్నారు. పాఠశాల వద్ద విద్యార్థుల సౌకర్యార్థం అండర్‌పాస్ బ్రిడ్జిని వేయాలని కోరారు. పనులను అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించినా వెనక్కి తగ్గలేదు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు.

గ్రామ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీహరి, ఎంపీ కావ్యలు జీవో ప్రకారం బ్రిడ్జి ఏర్పాటుకు గ్రామాన్ని సందర్శించిన క్రమంలో మార్కింగ్ చేశారన్నారు. నెల రోజుల వ్యవధిలోనే మార్కింగ్ చేసిన చోట ఇళ్లు నిర్మించారని ఆరోపించారు. ఇళ్ల సాకుతో బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని గ్రామానికి చెందిన కొందరు నాయకులు వారి వ్యక్తిగత ప్రయోజనం కోసం వెనకాలకు మార్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు కనకం గణేష్, బాలగాని అని ల్ గౌడ్, ఎస్డీ రహీమ్, అన్నెపు అనిల్, పొన్న రాజేష్, సొన్నాయిల సురేష్, రాజ్‌మహ్మద్, ఎమ్డీ సర్వర్, ఎమ్డీ రఫి, సురేష్, అజయ్, సంతోష్, సంజీవ పాల్గొన్నారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ

కాళేశ్వరాలయంలో లక్ష వత్తుల పూజలు

మహదేవపూర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయంలో కార్తీక శోభ సంతరించుకుంది. శనివారం లక్ష వత్తుల పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయాన్నే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిల్వ పత్ర పూజలు, కృత్తికా మాస పూజలు చేశారు. అనంతరం ఉసిరిక చెట్టు వద్ద లక్ష వత్తుల కార్యక్రమాన్ని నిర్వహించగా మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి గోదావరి నుంచి నీటిని తీసుకొచ్చి పంచ తీర్థ అభిషేకం చేస్తున్నారు. శనివారం ఈ కార్యక్రమం ప్రారంభం కాగా ఐదు రోజుల పాటు కొనసాగనుంది.

గోదావరికి హారతి

కార్తీక మాసం సందర్భంగా శనివారం సాయంత్రం వేద పండితులు గోదావరికి హారతి నిర్వహించారు. ముందుగా ఆలయం నుంచి వేద మంత్రాలతో గోదావరి ఒడ్డుకు చేరుకుని హారతి ఇచ్చారు. అనంతరం గోదావరి మాతకు చీర సారె సమర్పించారు.



ఉసిరిక చెట్టు కింద వత్తులు వెలిగిస్తున్న భక్తులు



జనగామలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

సీఎం దిష్టిబొమ్మ దహనం

జనగామ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో జనగామలో దహనం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ మాట్లాడుతూ 'పాకిస్తాన్ మీద బాంబులు వేయలేని కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. జూబ్లీహిల్స్‌లో వేస్తారని' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి అవహేళన చేశారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవరాయ ఎల్లయ్య, శానబోయిన మహిపాల్, ఈర్ల నవీన్, పెద్దోజు జగదీశ్, శివకృష్ణ పాల్గొన్నారు.

● వెంకటాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని నిరసనను అడ్డుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రామెళ్ల రాజశేఖర్, లక్ష్మీపతి, నోముల శ్రీకిషన్, ఈశ్వర్, సత్యనారాయణ, విజయ్, మట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిమ

15న ప్రత్యేక లోక్ అదాలత్

జనగామ రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న నిర్వహించే స్పెషల్ లోక్ అదాలత్‌కు వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ సూచించారు. శనివారం జనగామలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలీసులు స్పెషల్ లోక్ అదాలత్ సందర్భంగా రాజీపడే కేసు లను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కక్షలకు పోయి జీవితాన్ని, సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఈ. సుచరిత, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శశి, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఏసీపీలు పండరి చేతన్ నితిన్, నర్సయ్య, భీం శర్మ, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

భళా లోకేష్





13వ నేషనల్ పారా అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం అందుకుంటున్న లోకేష్ (ఫైల్)

- పారా అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్న యువకుడు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో 16 బంగారు, 6 రజత, 3 కాంస్య పతకాలు కైవసం
- దివ్యాంగుడైనప్పటికీ బాల్యం నుంచే క్రీడలపై ఆసక్తి
- కోచ్ వేణు శిక్షణలో పరిమళిస్తున్న ప్రతిభ
- పారా యూత్ ఏషియన్ గేమ్స్‌కు ఎంపిక

ఖానాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అతడు పుట్టుకతోనే దివ్యాంగుడు... కానీ తనలోని లోపాన్ని చూసి అధైర్యపడలేదు. చిన్ననాటి నుండే క్రీడల పట్ల మక్కువ పెంచుకున్నాడు. ఆటలపై ఇష్టం అతడిని పాఠశాల స్థాయిలోనే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేలా చేసింది. పాఠశాల స్థాయిలో కబడ్డీతో మొదలైన అతడి ప్రస్థానం అథ్లెటిక్స్ తైక్వాండో పోటీలలో దేశానికి ప్రాతినిధ్యం వహించేస్థాయికి ఎదిగాడు. డిసెంబర్‌లో దుబాయ్‌లో జరగబోయే పారా యూత్ ఏషియన్ గేమ్స్‌కి ఎంపికై శిక్షణ పొందుతున్నాడు. అతడే. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన పారా అథ్లెట్ ఆకుల లోకేష్.



తల్లిదండ్రులతో లోకేష్

నేపథ్యం..

ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన ఆకుల ఉప్పలయ్య -మంజుల దంపతుల చిన్నకుమారుడు లోకేష్ పుట్టుకతోనే దివ్యాంగుడు. అతడికి ఎడమచేయి లోపం ఉంది. చిన్ననాటి నుంచి అతడికి ఆటలంటే ఎంతో మక్కువ. 7వ తరగతి చదువుతున్నప్పుడు పాఠశాల స్థాయి పోటీలలో పాల్గొని షాట్‌పుట్‌లో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి పొందాడు. 2016లో పాఠశాల స్థాయి కబడ్డీ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికై బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున ఆడాడు. 2017లో పాఠశాల స్థాయిలో హైదరాబాద్‌లో జరిగిన స్టేట్‌మీట్ అథ్లెటిక్స్‌లో పోటీలలో పాల్గొని షాట్‌పుట్, రన్నింగ్ (200 మీటర్ల విభాగంలో)పోటీలలో బంగారు పతకాలు గెలుచుకున్నాడు. వీటితో పాటుప్రతి ఏటా ఖేలో ఇండియా పోటీలలో పాల్గొని ప్రతిభ చూపి పతకాలు సాధించాడు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో..

లోకేష్ 2021లో భువనేశ్వర్‌లో జరిగిన నేషనల్ పారా అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నాడు. ప్రతిభ ఉన్నప్పటికీ సరైన శిక్షణ లేకపోవడంతో రాణించలేకపోయాడు . అక్కడే లోకేష్‌లోని ప్రతిభను గుర్తించిన పారా అథ్లెట్ కోచ్ వేణు హైదరాబాద్ స్పోర్ట్స్ హాస్టల్‌లో సదుపాయం కల్పించాడు. కఠిన శిక్షణ ఇచ్చి గొప్పగా తీర్చిదిద్దాడు . ఈ క్రమంలో 2021లో గుజరాత్‌లో జరిగిన 12వ నేషనల్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్ పోటీలలో లోకేష్ పాల్గొని షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించాడు. వెంటనే లోకేష్‌కు ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీలో చోటు కల్పించారు. 2024 జూలైలో బెంగుళూరులో జరిగిన 13వ నేషనల్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అండర్ (19)విభాగంలో షాట్‌పుట్, డిస్కస్ త్రోలో బంగారు పతకాలు, జావెలిన్ త్రోలో వెండి పతకం సాధించి ఔరా అనిపించాడు. లోకేష్ దేహదారుఢ్యం బలంగా ఉండడంతో కోచ్ వేణు అథ్లెటిక్స్‌తో పాటు తైక్వాండో పోటీలకు శిక్షణ ఇచ్చారు. దీంతో సెప్టెంబర్‌లో పంజాబ్‌లో జరిగిన పారా యూత్ ఏషియన్ గేమ్స్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచి డిసెంబర్‌లో దుబాయ్‌లో జరుగబోయే పారా యూత్ ఏషియన్ గేమ్స్‌కి ఎంపికయ్యాడు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో 16 బంగారు పతకాలు,6 రజత పతకాలు,3 కాంస్య పతకాలు సాధించాడు.

పారా ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం

- ఆవుల లోకేష్, పారా అథ్లెట్

పారా ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం సాధించడమే నా జీవిత లక్ష్యం. ముందుగా యూత్ ఏషియన్ గేమ్స్‌లో పతకం సాధించడానికి కష్టపడుతున్నా. కోచ్ వేణు పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నాను. తప్పక పతకం సాధిస్తానన్న నమ్మకం ఉంది. పోటీలకు వెళ్లడానికి నా ఆర్థిక పరిస్థితి సరిపోవడం లేదు. దాతలు, ప్రభుత్వం స్పందించి దుబాయి వెళ్లడానికి సహకరించాలి.



కొంకపాకలో పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తదితరులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే మంజూరు చేయాలి
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్

పర్వతగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొంకపాక గ్రామంలో పంట నష్టపోయిన క్షేత్రాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల భారీ తుఫాన్‌తో లక్షలాది ఎకరాల్లో పంటల నష్టం జరిగి రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారిని ఆదుకోవడానికి ఎకరాకు రూ.30 వేలు, ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు మంజూరి చేయాలని, చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన తుఫాన్ బారిన పడిన పంటల వివరాలు సేకరించాలన్నారు. తాత్కాలికంగా రూ.20 వేలు, 50 కిలోల బియ్యం, బెట్ షీట్లు, చెద్దర్లు, బట్టలు ఇవ్వాలని కోరారు. పశువులు కోల్పోయిన వారిని కూడా ఆదుకోవాలన్నారు. అనంతరం రావూరు గ్రామానికి చెందిన సొసైటీ డైరెక్టర్ దొమ్మటి లక్ష్మీ నారాయణ బైక్ ప్రమాదంలో గాయాలపాలు కాగా, ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌కుమార్, చింతపట్ల సోమేశ్వర్ రావు, మాడుగుల రాజు, చిన్నపాక శ్రీనివాస్, రంగు కుమార్, మోహన్ రావు, మేరుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో క్రీడా సందడి

ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 ఎంపిక పోటీల షురూ



జిమ్నాస్టిక్స్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో కఠోర సాధన, పట్టుదలతో శ్రమించడం ద్వారా రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు చేరుకోవచ్చని హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-14, 17 ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్ లోని జిమ్నాస్టిక్స్ హాల్లో శనివారం ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి అండర్-14, 17బాలబాలికల జిమ్నాస్టిక్స్, జూడో క్రీడా పోటీలను అడిషనల్ కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు అవసరమన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎదగాలంటే జిల్లా స్థాయి నుంచే ఆటల్లో ప్రావీణ్యం పెంచుకోవాలని సూచించారు. డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడాకారులు తమ ప్రతిభతో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు పథకాలు సాధించి జిల్లాకు కీర్తి, ప్రతిష్టలు తీసుకరావాలని ఆకాక్షించారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి అండర్-14, 17బాలబాలికల జిమ్నాస్టిక్స్, జూడో క్రీడాంశాల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఈ క్రీడా పోటీలు 3రోజుల పాటు కొనసాగుతాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో త్వరలో నిర్వ హించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు (టీజీపేట) శీలం పార్థసారథి, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసి యేషన్ (ఎస్ఏపీఈటీఏ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ప్రభాక ర్‌రెడ్డి, డి.కుమార్, కన్వీనర్లు సీహెచ్. పెద్దిరాజు, ఎం.సురేష్‌బా బు, వి.రాణి, ఎస్.శ్రీలత, జూడో అబ్జర్వర్ సత్యనారాయణ, కోచ్‌లు నీలం సురేష్, సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్.సుభాష్, జి. రవీంద్రప్రసాద్, రెఫరీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి, రోడ్డును పునఃనిర్మించాలి

» స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి » ధ్వంసమైన పంటలు, రహదారుల పరిశీలన » ఇరిగేషన్ అధికారులపై రైతుల ఆగ్రహం

కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి



ధర్మసాగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో కొట్టుకుపోయిన బ్రిడ్జి, రోడ్డును త్వరితగతిన పూర్తిచేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశించారు. ధర్మసాగర్ మండలంలో దేవునూర్ గ్రామంలో తుఫాన్ వల్ల నష్టపోయిన వరి పంటలను, ధ్వంసమైన బ్రిడ్జి, రోడును శనివారం ఆయన సందర్శించి పరిశీలించారు. దేవునూర్ బ్రిడ్జి నుంచి రాపాకపల్లి గ్రామానికి వెళ్లే బ్రిడ్జి వరకు కాలినడకన వెళ్లి నష్టపోయిన పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారుల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోయామని రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన తమ పంటలు నీటిలో మునిగి నష్టపోయామని దేవునూర్ గ్రామానికి చెందిన రైతులు నార్లగిరి సమ్మయ్య, చిట్టి రవి పురుగుల ముందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని పురుగుల మందు డబ్బాలను లాక్కుని సర్దిచెప్పడంతో రైతులు శాంతించారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన మరో రైతు మోరే మహేందర్ సాగు చేసిన మూడు ఎకరాల వరి పంట పూర్తిగా నష్టం వాటిల్లడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా వారించారు.

అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. వర్షం వల్ల నష్టం జరిగితే రైతుల అదృష్టం బాగాలేదని అనుకుంటాం.. కానీ, దేవాదుల ప్రాజెక్ట్ కాలువ గేట్ల వరద వల్ల రైతుల పంటలు మునిగిపోతే పరిహారం ఎవరు చెల్లించాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. దేవునూర్ బ్రిడ్జి మరమ్మతు, రోడ్డు పనులను 15 రోజుల్లో పూర్తిచేసి నిలిచిపోయిన రాకపోకలను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. దేవునూర్ బ్రిడ్జి, రోడ్డు తాత్కాలిక మరమ్మతు పనుల కోసం సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేసి త్వరితగతిన పనులను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వపరంగా మంజూరు చేసిన నిధులు సరిపోకుంటే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఈజీఎస్ నిధులు మంజూరు చేయిస్తామని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. వరద వల్ల రైతుల పంటలు నష్టపోకుండా ఉండాలంటే వాగును వెడల్పు చేయాలని, ఇందుకోసం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులను గుర్తిస్తే ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి పనులను చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు రైతులు సహకరించాలని, పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు ఏదో విధంగా ఆర్థిక సాయం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాద్, మండల నాయకులు పాషా, రఘు, కుమార్, మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి రాజేష్, ఆర్ఐ అనిత తదితరులు పాల్గొన్నారు.



పురుగుల మందు తాగేందుకు ప్రయత్నిస్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

నేడు సాట్ 'క్యూ' ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్



సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని విడుదల చేస్తున్న వరదారెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం, ఉన్నత విద్య అవకాశాలను విస్తరించడమే లక్ష్యంగా ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రత్యేక ప్రతిభా పరీక్ష సాట్ క్యూ ఎస్సార్ అకడమిక్ టాలెంట్ క్వెస్ట్ ఈ నెల 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీలోని ఎస్సార్ ఎడ్యు సెంటర్‌లో శనివారం సాట్ క్యూ టాలెంట్ క్వెస్ట్ కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఇంటర్మీడియట్‌లో చేరబోయే 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ టీచర్స్ కాలనీ ఎస్సార్ ఎడ్యు సెంటర్ కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10వ తరగతి స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సిలబస్‌లో మొత్తం 75 ప్రశ్నలు (ప్రతి సబ్జెక్టుకు 25 చొప్పున) ఉంటాయని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు, 100 శాతం స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశంతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ ప్రవేశం పొందే ఎంపీసీ స్ట్రీమ్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ (ఫోకస్ ప్రైమ్/ఫోకస్ ప్లస్/ఫోకస్/స్పార్క్/టైటన్) బైపీసీ స్ట్రీమ్ నీట్, ఎంసెట్ (ఫోకస్ ప్రైమ్/టైటన్) కోర్సులకు అర్హులని తెలిపారు. ఎస్సార్ ఎడ్యుకేషనల్ అకాడమీ తన 50 ఏళ్ల విద్యా ప్రావీణ్య సంప్రదాయాన్ని కొనసాగిస్తుందన్నారు. దేశంలోనే ఉత్తమ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సాట్ క్యూ పరీక్షను నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకొని ఉత్తమ స్కాలర్‌షిప్ అవకాశాలను పొందాలన్నారు. విద్యార్థులు పరీక్ష నమోదు కోసం సమీపంలోని ఎస్సార్ బ్రాంచ్‌ను లేదా 9642117378, 9154989356, 8886287456, 9154854700, 9642117330, 9642117830, 9642114698 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇప్పటికైనా కదిలేనా!?

(5వ పేజీ తరువాయి)

అడ్డు వస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఎఫ్‌టీఎల్ పరిధిలో మరో 321కి పైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు సమాచారం. ఈ అక్రమ కట్టడాల వల్ల హంటర్‌రోడ్డులో పలు కాలనీల్లోకి వరద నీరు చేరుతోంది.

అలాగే వరంగల్ దేశాయిపేటలోని చిన్నవడ్డెపల్లి చెరువు 70.74 ఎకరాల్లో విస్తరించి ఉండగా, సుమారు 35 ఎకరాలకు పైగా చెరువు భూమి కబ్జాకు గురైంది. చెరువు శిఖంను అక్రమించుకుని 329 అక్రమ నిర్మాణాలు చేపట్టగా, కేవలం 12 అక్రమ కట్టడాలనే అధికారులు కూల్చివేసి, 110 కట్టడాలకు సంబంధించి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇంకా 211 అక్రమ నిర్మాణాలకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. అలాగే కాజీపేటలోని నిట్ వెనకాల ఉన్న బంధం చెరువు సుమారు 65.20ఎకరాల్లో విస్తరించి ఉంది. దాదాపు ఈ చెరువులో 366 అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లుగా అధికారులు గుర్తించారు. అయితే కేవలం పాతిక అక్రమ కట్టడాలనే కూల్చివేసిన అధికారులు.. మరో 125 అక్రమ కట్టడాలకు నోటీసులు ఇచ్చి మరిచిపోయారనే విమర్శలు ఉన్నాయి. మిగతా 220 అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు లేకపోవటం వెనుక మతలబేమిటనే చర్చ జరుగుతోంది.

అలాగే పైడిపల్లి శివారులో హనుమాన్ జంక్షన్ సమీపంలోని కోటచెరువు 172.40 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ఇందులో 70ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్లుగా గుర్తించారు. ఈ చెరువు భూముల్లో 150 అక్రమ కట్టడాలు నిర్మించారు. అధికారులు 4 అక్రమ నిర్మాణాలను తొలిగించి, 50మందికి నోటీసులు ఇవ్వగా, మిగతా 96 అక్రమ నిర్మాణాలపై దాటవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హనుమకొండలోని వడ్డెపల్లి చెరువు 556.32 ఎకరాల్లో విస్తరించి ఉండగా, దీనిలో సుమారు 100 ఎకరాల వరకు భూమి అక్రమణకు గురైనట్లుగా ఆరోపణలున్నాయి. చెరువు కట్టను అక్రమించుకుని ఫంక్షన్ హాల్స్, అపార్ట్‌మెంట్స్ నిర్మించారని ఫిర్యాదులు అందినప్పటికీ అధికారులు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలున్నాయి. అలాగే గోపాల్‌పూర్ చెరువు నేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిల్లో కరిగిపోయిందనే విమర్శలు ఉన్నాయి. అక్రమాలతో గోపాల్‌పూర్ చెరువు నీళ్ల కాలనీలను ముంచెత్తింది. ఉర్సు చెరువు, తిమ్మాపూర్ బెస్తం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, రంగశాయిపేట చెరువులతో పాటు నగరంలోని, శివారులోని చెరువులు, కుంటల్లో కబ్జారాయుళ్ల తిష్టవేసి చెరువులనే మింగేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మురికిలోనూ కబ్జాలే..

మురికి కాలువలను కూడా కబ్జాకోరులు వదలటం లేదు. నయీంనగర్ నాలాకు ఇరువైపులా భారీగా కబ్జాలు చేశారు. 5.55 కిలోమీటర్లు ప్రయాణించే నయీంనగర్ నాలాకు వడ్డెపల్లి చెరువు నుంచి గోపాలపూర్ ఊర చెరువు వరకు 136 అక్రమ కట్టడాలు నిర్మించారు. వీటిలో అధికారులు కేవలం 36 అక్రమ నిర్మాణాలనే తొలగించగా, మిగతా అక్రమ నిర్మాణాలను తొలిగించటంపై కార్పోరేషన్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో పలువురు కోర్టును ఆశ్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అలాగే నయీంనగర్ నాలాలో మరో భాగం రాజాజీనగర్ బ్రిడ్జి నుంచి కాకతీయ కెనాల్ బ్రిడ్జి వరకు 147 అక్రమ కట్టడాలు ఉన్నాయి. వీటిలో 56 అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించగా, 33 నిర్మాణాలపై కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. మిగిలినా అక్రమ నిర్మాణాలను తొలగించటంలో అధికారులకు రాజకీయ అడ్డంకులు ఎదురవుతున్నాయి. అలాగే భద్రకాళి నాలా 3.63కిలో మీటర్లు ప్రవహిస్తోంది. ఇందులో పోతననగర్, అలంకార్ బ్రిడ్జి, అలాగే కాపువాడ, భద్రకాళి మత్తడి, అలంకార్ బ్రిడ్జి వరకు మొత్తం 101 అక్రమ కట్టడాలు ఉన్నట్లుగా గుర్తించారు. అలంకార్ బ్రిడ్జి నుంచి కాకతీయ కెనాల్ వరకు 30 అక్రమ నిర్మాణాలు ఉండగా, 11 నిర్మాణాలను తొలగించారు. మిగతా 19 అక్రమ కట్టడాల వైపు చూసేందుకు అధికారులు జంకుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక హంటర్‌రోడ్డులో బొందివాగు నాలా 0.84కిలో మీటర్లు ప్రవహిస్తోంది. ఇందులో బెస్తం చెరువు నుంచి జక్కలొద్ది వరకు 8 అక్రమ నిర్మాణాలు ఉండగా, నాలుగు కట్టడాలపై కోర్టులో కేసు నడుస్తున్నది. సాకరాశికుంట నాలా 6.40కిలో మీటర్లు నగరంలో ప్రవహిస్తోంది. ఈ నాలాకు ఇరువైపులా 102 అక్రమ కట్టడాలు ఉన్నట్లు గుర్తించినప్పటికీ అక్రమ నిర్మాణాలన్నింటినీ తొలగించేందుకు అధికారులు ముందుకు రాకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

మొత్తం వరంగల్ మహానగరంలో నాలుగు ప్రధాన నాలాలకు ఇరువైపులా 524 అక్రమ కట్టడాలను గుర్తించారు. ములుగురోడ్డు సమీపంలో కొందరు అక్రమార్కులు 40 ఎకరాల భద్రకాళి నాలా భూములను అక్రమించుకుని దర్జాగా వ్యాపార నిర్మాణాలు చేపట్టారు. వేల కోట్ల విలువైన నాలా భూములు కబ్జాకోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. భద్రకాళి నాలా వద్ద ఎల్‌బీ కాలేజీ సమీపంలో 60మంది రజక కులస్తులకు కేటాయించిన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమించుకుని దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టారని, ఆ కులస్థులు పదేళ్లకు పైగా పోరాటం చేస్తున్నారు. నాలాల ద్వారా బయటకు వెళ్లాల్సిన వరద నీరు రోడ్డెక్కుతోంది.

అయితే సీఎం ఆదేశాలను అమలు చేసేందుకు అధికారులు ముందుకు వస్తారా..? వస్తే రాజకీయం అడ్డు తగలకుండా ఉంటుందా అనే చర్చ జరుగుతోంది. గోపాల్‌పూర్ చెరువు అక్రమణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కీలకంగా ఉన్న ప్రజాప్రతినిధులే కాకుండా, ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలు ఉన్నారనే ప్రచారం ఉంది. అలాగే చిన్నవడ్డెపల్లి చెరువుల, బంధం చెరువు, కోటా చెరువు, భద్రకాళి చెరువు శిఖం అక్రమణలో అన్ని పార్టీల్లోని కొందరు కీలక నేతలు, వారి అనుచరగణం ఉంది. రాజకీయ బెదిరింపులను తట్టుకుని అధికారులు కబ్జాలపై కన్నెత్తి చూడగలరా? అనే చర్చ నడుస్తోంది.

అధికారుల్లో కదలిక వచ్చేనా ?

మొంథా తుఫాన్‌కు వరంగల్ జలమయం కావటంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. వరంగల్ నగరానికి ప్రధానంగా ఉన్న గొలుసుకట్టు చెరువుల అక్రమణ, నాలాల కబ్జాలే వరద ముంపునకు కారణంగా గుర్తించారు. దీంతో శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో నాలాల కబ్జాలు, చెరువుల అక్రమణపై ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, పది మంది కోసం వేల మందిని ఇబ్బంది పెట్టడం సరికాదని సీఎం అన్నారు. కబ్జాల్లో ఎంతటి వారు ఉన్న వదలకుండా చర్యలకు దిగాలని ఆదేశాలు జారీ చేశారు.

చోరీల నిందితుడి అరెస్టు

- రూ.6 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసి రూ.6 లక్షల విలువ చేసే 40 గ్రాముల బంగారు, 50 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.56,400 నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. శనివారం కేయూ పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేరుల సమావేశంలో నిందితుడి అరెస్టు చూపి వివరాలు వెల్లడించారు. కొమురంభీం అసిఫాబాద్ జిల్లా వాంకిడి, తేజిగూడకు చెందిన సెండె అరుణ్‌కుమార్ 2022లో వరంగల్‌లోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజడ్‌సీ పూర్తి చేసిన తరువాత ఒక సంవత్సరం ఇంటి వద్దే ఖాళీగా ఉంటూ తల్లిదండ్రులతో జీవనం సాగించాడు. 2024లో ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు హనుమకొండకు వచ్చి గది అద్దెకు తీసుకొని చదువుకునేవాడు. ఈ క్రమంలోనే అరుణ్‌కుమార్ బెట్టింగులకు బానిసై చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గోపాల్‌పూర్, భీమారం ఏరియాలలో ఇంటికి తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి పూట తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లేవాడు. నిందితుడు సుమారు 10 నేరాలు చేసినట్లు అంగీకరించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. ఇందులో భాగంగా నిందితుడి వద్ద 10 కేసులలో మొత్తం రూ.6 లక్షల విలువైన 40 గ్రాముల బంగారు, 50 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.56,400 నగదును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన కేయూసీ ఎస్సైలు పి.శ్రీకాంత్, కె.నవీన్‌కుమార్, క్రైం సిబ్బంది అహ్మద్ పాషా, రాజశేఖ ర్, జితేందర్, సీసీఎస్ వరంగల్ సిబ్బంది టి. మధు, బి.చందులను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై వేటు

» బతికున్న వ్యక్తిని మార్చురీకి తరలించిన ఘటనలో చర్యలు

» విధులను నిర్లక్ష్యం చేయొద్దు : ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మానుకోట జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెహ్రూసెంటర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు విధులను నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యాధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందని, అలా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆస్పత్రిలో నర్సులు.. కాలక్షేపం చేస్తూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పనిచేయిస్తున్నారన్న విషయం కూడా తెలిసిందని పేర్కొన్నారు. ఈ విషయంపై మరోసారి ఆరోపణలు వస్తే సహించేది లేదన్నారు. ఆదివారం నుంచి ఏ ఒక్క ఉద్యోగి ఆస్పత్రిలో విధుల్లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ ఉపయోగించవద్దన్నారు. అత్యవసరమైతే స్మార్ట్ ఫోన్‌లకు బదులుగా కీప్యాడ్ ఫోన్‌లను ఉపయోగించాలన్నారు. ప్రాణాలతో ఉన్న వ్యక్తిని మార్చురీకి తరలించిన ఘటనలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది సీహెచ్.వెంకన్న (సెక్యూరిటీ గార్డు), రాజన్న (శానిటేషన్ సూపర్‌వైజర్)లను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఆదే శించారు. కాగా, ఇరువురిని విధుల నుంచి తక్షణమే తొలగించినట్లు ఆస్పత్రి సూపరిం డెంట్ బత్తుల శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ లకావత్ వెంకట్, జిల్లా ఆస్పత్రి ఆర్ఎంవో బానోత్ జగదీష్ ఉన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి : సీపీఐ

ములుగు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో రోడ్లపై మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వ ఎంపీడీవో హనుమంతరావుకు సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అమ్జద్ పాషా మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాల్లో అంతర్గత రోడ్లకు మలుపులు ఉన్నాయని అన్నారు. వాటి వద్ద వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, శ్యాంసుందర్, గోడ రమేష్, రామ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటకు అగ్గి తెగులు

ఆందోళన చెందుతున్న అన్నదాతలు ● అకాల వర్షాల కారణంగా తీవ్ర నష్టం



ఏటూరునాగారం మండలం శివపురంలో వరి పంటకు రసాయన మందును పిచికారీ చేస్తున్న రైతులు

ఏటూరునాగారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరి పంటలు అగ్గి తెగులు బారిన పడుతున్నాయి. దీంతో ములుగు జిల్లా ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట పొట్ట దశకు చేరుకున్న సమయంలో ఇలా తెగుల బారిన పడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రెండు సీజన్లుగా నష్టాలను చవి చూసిన రైతులు ఈ సారి కూడా పంటలు దెబ్బతినడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వరి పంటను రక్షించు కునేందుకు పురుగుల మందులను పలుమార్లు పిచికారీ చేస్తున్నప్పటికీ తెగుల నుంచి రక్షణ పొందలే కపోతున్నారు. ఇవే కాకుండా వరి పంటలు, దోమకాటు, చీడపీడలు, వివిధ వైరస్‌ల బారిన పడుతున్నాయి.పంటకు సోకిన దోమ, అగ్గి తెగులు నివా రణకు రసాయన మందులు పనిచేయకపోవడంతో నష్టం మరింత పెరు గుతోంది. దీంతో పంట పొలాల్లో ఆకులు ఎరుపు రంగులోకి మారి మాడి పోతుండటంతో పెట్టుబడి కూడా దక్కదేమోనని రైతులు లబోదిబో మంటున్నారు.

పెస్టిసైడ్ వ్యాపారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకోని దోమ, అగ్గి తెగులును నివారించలేని, పనికిరాని మందులను అంటగ డుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రజ్ఞులు కనీసం పర్యవేక్షణ కూడా చేయడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ మందులు వాడినప్పటికీ తెగుళ్ల తగ్గడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉన్న తాధికారులు తక్షణమే క్షేత్ర పర్యటన చేసి, వరి పంటలకు సోకిన దోమ కాటు, అగ్గి తెగులు నివారణకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి రైతుల ను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

మొంథా తుఫాన్ కారణంగా తీవ్ర నష్టం

మొంథా తుఫాన్ రైతున్నలను నిండా ముంచింది. నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన వరి పంటలు నేలవాలగా, విలువైన మిరప తోటలు కూడా పూర్తిగా నీటమునిగి దెబ్బతిన్నాయి. పంట నష్టంతో రైతులు లబోదిబోమంటున్నారు.

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో కురిసిన వర్షాలకు ముఖ్యంగా ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలోని మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం మండలాలో బలమైన ఈదురుగాలుల దాటికి పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు మొత్తం నేలకొరిగింది. మొన్నటి వరకు పచ్చగా కళకళలాడిన చేలు భారీ ఈదురుగాలులతో నేలవాలాయి. వరితో పాటు రైతులకు అధిక ఆదాయాన్నిచ్చే మిరప పంటకు కూడా నష్టం వాటిల్లింది. అధిక వర్షం కారణంగా మిర్చి తోటలు సైతం వర్షం ధాటికి కుళ్లిపోయే దశకు చేరుకున్నాయి.

విజృంభిస్తున్న సుడిదోమ

కాటారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వరి పంటకు ఢోకా లేదని ఆశపడుతున్న రైతాంగానికి ఇటీవల అననుకూల వాతావరణంతో తెగుళ్ల సోకడం, ముఖ్యంగా సన్న రకాల వరికి దోమపోటు రావడంతో ఆందోళన నెలకొంది. భూపాలపల్లి జిల్లాత కాటారం మండలంలో పలు చోట్ల వరి పంటలో సుడిదోమ(దోమపోటు) విజృంభిస్తుండటంతో రైతులు దిక్కుతోచక ఆవేదన చెందుతున్నారు. రెండు నెలల పంట నుంచి మొదలుకొని కోతకు వచ్చిన వరి పొలంలోనూ దోమపోటు రావడంతో పంటల దిగుబడులు, గింజల నాణ్యతపై ప్రభావం చూపనుంది. దీంతో రైతులు తమ వరి పంటను కాపాడుకోవడానికి, ఎరువుల షాపుల వద్దకు పరుగులు తీస్తున్నారు. దోమపోటును నియంత్రించే మందులను పిచికారీ చేయడానికి చర్యలు చేపడుతున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లోనూ సుడిదోమ తీవ్రంగా నష్టపర్చిందని, ఈ ఏడాది మళ్లీ ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చాలా చోట్ల దోమపోటు లక్షణాలు కనిపిస్తున్నాయ ని, రైతులు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సుడి దోమ లక్షణాలు.. నివారణ చర్యలు

- సుడిదోమ గోదమ లేదా తెల్ల మచ్చలు కలిగి ఉండి వరి దుబ్బులకు అడుగున నీటిమట్టంపై ఉండి దుబ్బుల నుంచి రసాన్ని పీలుస్తాయి.
- దుబ్బుల వద్ద జిగటగా మారి వరి మొదళ్లు కుళ్లిపోతాయి.
- దీని తీవ్రత అధికంగా ఉన్నప్పుడు వరి పైరు సుడులు, సుడులుగా ఎండిపోతుంది.
- పైరు ఈనిన దశలో ఉన్నప్పుడు ఒక్కో దుబ్బుకు 20-25 దోమలు కనిపిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అంటున్నారు నిపుణులు.
- వరి పొలంలో ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పున కాలిబాటలు తీయాలి.
- కోతకు వచ్చిన పొలాన్ని ఆరబెట్టాలి.
- దోమపోటు నివారణకు ఎకరాకు బ్యూప్రోఫెజిన్ మందును 330 ఎంఎల్ లేదా డైనేటో ఫ్యూరాన్ 80 గ్రాములు లేదా పైమెట్రోజిన్ 120 గ్రాముల మందును పిచికారీ చేయాలి.
- వరి పైరు మొదళ్ల తడిచే విధంగా పిచికారీ చేయాలి.

చలో హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు

వెంకటాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్.గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా హైదరాబాద్‌లో మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన దళితుల ఆత్మగౌరవ ర్యాలీకి మండల కేంద్రం నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తరలివెళ్లిన వారిలో ఎమ్మా ర్పీఎస్, ఎంఎస్పీ నాయకులు జన్ను రవి, కాడపాక శ్యామ్, గడ్డమీది సంపత్, భాస్కర్, కాడపాక రాజు, రత్నం రమేష్, కిరణ్, మల్లేష్, గాజుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా రమాదేవి



ఏటూరునాగారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మండల ఇన్‌చార్జి పంచాయతీ అధికారి (ఎంపీవో)గా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి బి.రమాదేవి నియమితులయ్యారు. అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకాలం ఇక్కడ ఎంపీవోగా పనిచేసిన కుమార్ పెద్దపల్లి జిల్లాకు ఇటీవల బదిలీ కావడంతో ఆ స్థానంలో కొత్త అధికారిని నియమించే వరకు రమాదేవి ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.

నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ డైరెక్టర్ లూర్థురాజు

వెంకటాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలుబాక జిల్లాపరిషత్ పాఠశాలలో శనివారం కాఫెడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ లూర్థురాజు మాట్లాడుతూ పిల్లలు మంచిగా చదువుకుని తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు తీసుకు రావాలన్నారు. లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ అంటే మనలో ఉన్న నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడమేనని పేర్కొన్నారు. పాఠశాల హెచ్ఎం రమేష్, సంస్థ మండల కోఆర్డినేటర్ హనుమంతు, సభ్యులు కామేష్, భాస్కర్, ప్రశాంత్, నరేష్, పద్మ, ఇందిర, ఉష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జీపీ కార్మికుడి మృతి



రవీందర్(ఫైల్)

ములుగు రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుండె పోటుతో గ్రామ పంచాయతీ కార్మికుడు మృతిచెం దిన సంఘటన ములుగు మండలంలోని దేవగిరిప ట్నంలో శనివారం చోటు చేసుకుంది. పంచాయతీ కార్య దర్శి నిరంజన్ రెడ్డి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దారావత్ రవీందర్(42) ఉదయం విధులకు హాజరయ్యాడు. చెత్త సేకరిస్తున్న క్రమంలో ఛాతీలో నొప్పి వస్తుందని కార్యదర్శితో తెలిపాడు. దీంతో ఆయన రవీందర్‌ను ఆస్పత్రికి వెళ్లమని సూచించాడు. రవీందర్ అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, కుమారుడు పవన్, కూతురు రీతు ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ముగిసిన శిక్షణ తరగతులు

ఏటూరునాగారం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. అక్టోబరు 27 నుంచి నవంబరు 1 వరకు జరిగిన ఈ శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బి.రేణుక అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు వారం రోజుల్లో శిక్షణ ద్వారా వివిధ రకాల నైపుణ్యాలను(స్కిల్స్) నేర్చుకున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థు లకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ కనీస్ ఫాతిమా, టీఎస్‌కేసీ మెంటర్, హెచ్. రమేష్, మెంబర్స్ జీవవేణి, భారతి, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందేస్తున్న నాయకులు

మహాముత్తారం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మహాముత్తారం మండలంలో గిరిజన సహకార సంస్థ ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏటూర్‌నాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో డివిజనల్ మేనేజర్ వాణికి ప్రజా సంఘాల నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఆదివాసీ, గిరిజన గ్రామాల పరిధిలో కల్లాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని, రైతులను దళారుల బారిన పడకుండా చూడాలని అధికారిని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా బోర్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఆదివాసీ గ్రామమైన గాజారాంపల్లిలో రోడ్డు నిర్మాణం చేపట్టాని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పూల్‌సింగ్, ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, ఠాకూర్ రవీందర్, కోట రాజు తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలు


ఇన్‌చార్జి డీడబ్ల్యూవో మల్లేశ్వరి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీడబ్ల్యూవో మల్లేశ్వరి

కృష్ణకాలనీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్త్రీ శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నెల రోజులపాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఇన్‌చార్జి డీడబ్ల్యూవో మల్లేశ్వరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఈ శాఖలోని వివిధ విభాగాల సిబ్బందితో సమావేశమయ్యారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలన, బేటి బచావో- బేటి పడావో వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి ఈ కార్యక్రమాలను డీసీపీయూ, సఖి, మహిళా సాధికారిత విభాగాలు సమన్వయంతో నిర్వహించాలన్నారు. జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లా మార్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల సిబ్బంది అనూష, గాయత్రి, కళావతి, మమత, తిరుపతి, కుమార్, ప్రవీణ్, రాంచరణ్, సాయిరాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గడువు దాటిన శీతల పానీయాల విక్రయాలు!



తాడ్వాయి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారం, పరిసర ఏజెన్సీ గ్రామాల్లో గడువు దాటిన కూల్‌డ్రింక్స్ విక్రయాలు జరుగుతున్నాయని వినియోగ దారులు అంటున్నారు. పలు కంపెనీలకు చెందిన శీతల పానీయాలను ఎక్స్‌పైరీ డేట్ ముగిసినా అమ్ముతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఓ ప్రముఖ కంపెనీకి చెందిన డీలర్ యథేచ్ఛగా ఈ తరహా కూల్‌డ్రింక్‌లు జోరుగా విక్రయిస్తున్నాడని తెలుస్తోంది. ఇలాంటి శీతల పానీయాలు కొత్తూరు శివారు చిరు వ్యాపారుల వద్ద ఉండగా ఇదేమిటని ప్రశ్నించగా తమకు సరఫరా చేసిన డీలర్ ఇలాంటివే పంపాడని అంటున్నాడని వినియోగదారులు తెలిపారు. గడువు ముగిసిన బాటిళ్లను వాపస్ తీసుకోవడం లేదని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. డీలర్ వాపస్ తీసుకోకపోవడంతో చిరువ్యాపారులు తమకు నష్టం వాటిళ్లకుండా గడువులేని కూల్ డ్రింక్స్ గిరిజన ప్రజలకు, మేడారం వస్తున్న భక్తులకు అమ్ముతున్నారని సమాచారం. మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి ద అధికారులు తనిఖీలు నిర్వహించిచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

అనారోగ్య బాధితురాలికి ఎల్‌వోసీ అందజేత

కాటారం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గట్లకుంట గ్రామానికి చెందిన బానోత్ సమ్మక్కకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్లశ్రీధర్‌బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. సమ్మక్క అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం సాయం అందించాలని మంత్రి శ్రీధర్ బాబును కోరారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించగా మంత్రి వ్యక్తిగత సహాయకుడు శనివారం బాధితురాలి కుటుంబ సభ్యులకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో అందజేశారు.

మేడారంలో చురుగ్గా 'పునరుద్ధరణ'

(5వ పేజీ తరువాయి)

స్థలాల్లో వదులుతున్న వ్యర్థాలను తొలగిస్తున్నారు. మరుగుదొడ్లు, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీని శుభ్రపర్చడం లాంటి పనులు ఎప్పటికప్పుడు చేపడుతున్నారు.

భక్తుల రక్షణకు టూరిస్ట్ పోలీసులు

సమ్మక్క- సారలమ్మల దేవస్థానం వద్ద భక్తుల భద్రత కోసం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఐదుగురు టూరిస్ట్ పోలీసులను నియమించారు. వారు శనివారం విధుల్లో పాల్గొన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రక్ష ణ చర్యలు నిమిత్తం 80మందిని నియమించినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా మేడారానికి పోలీసు సిబ్బంది ఐ.వెంకటేశ్వరావు, కె.జనార్దన్, ఎస్.చంద్రశేఖర్, కె.అశోక్, ఎల్.ప్రభాకర్‌ను నియమించారు. దర్శనాల సమయంలో దొంగతనాలను అరికట్టడం, గద్దె వద్ద రద్దీ నియంత్రణ, హుండీల సంరక్షణ, తప్పిపోయిన వారిని గుర్తించడం, భక్తులకు సమాచారం అందించడం వంటి సేవలు ఈ టూరిస్ట్ పోలీసులు అందించనున్నారు.

యూ డైస్‌ప్లస్‌లో కచ్చితమైన సమాచారం నమోదు చేయాలి

విద్యా శాఖ జిల్లా అధికారి సిద్ధార్థరెడ్డి

ములుగు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): యూ డైస్‌ప్లస్‌లో కచ్చితమైన సమాచారం నమోదు చేయా లని మండల విద్యాశాఖ అధికారులకు, ప్రధానో పాధ్యాయులకు విద్యాశాఖ జిల్లా అధికారి సిద్ధార్థరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని విద్యా శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ జిల్లాలో మొత్తంగా 30 స్కూల్ క్లాంప్లెక్స్‌లు ఉన్నాయని అన్నారు. ప్రతి క్లాంప్లెక్స్‌కు ఒక హెచ్ఎం, సీఆర్పీ ఉంటారని అన్నారు.

ఈ యాప్‌లో తప్పులు నమోదు చేస్తే జిల్లాకు సంబంధించిన టీజీఐ ర్యాంకు పడిపో తుం దని అన్నారు. అందుకు ప్రతీ అంశాన్ని నమోదు చేయాలని సూచించారు. జిల్లా ప్లానింగ్ క్వో ఆర్డినేటర్ హర్షం రాజు, సీఎంవో సాంబయ్య, జీసీడీవో రజిత, ఏపీవో తిరోజ్, మండల విద్యాధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రుద్రమదేవి సొసైటీలో అక్రమాలు

- రూ.7కోట్ల మేర జరిగినట్లు వెల్లడి
- తీర్పు వెలువరించిన సహకార ట్రిబ్యునల్
- పాలకవర్గం రద్దు.. ఆరుగురు ఉద్యోగుల తొలగింపు

జనగామ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రం లోని రుద్రమదేవి మహిళా సహకార సొసైటీలో అక్రమాల బాగో తం బయటపడింది. ఈ కేసు విషయంలో గలనెల 24న తీర్పురా గా, శనివారం సొసైటీ కార్యాలయానికి సొసైటీ నోటీసులను అం టించారు. అలాగే సొసైటీ అధికారిక కార్యనిర్వాహకురాలిగా జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.దివ్యను నియమించగా ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు. భూమి కొనుగోలు పేరుతో సొసైటీ నిధు ల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ గతంలో వివాదాస్పమైంది. సొసైటీలో జరిగిన అక్రమాలపై జిల్లా సహకార శాఖాధికా రి గతంలో వరంగల్ సహకార కోర్టును ఆశ్రయించారు. దీనిపై వాదనలు విన్న వరంగల్ సహకార ట్రిబ్యునల్ ఛైర్మన్ నారాయణబాబు అక్టోబరు 24న తీర్పును వెలువరించారు. జనగామ మండలం వడ్లకొండ శివారులో భూమి కొనుగోలు పేరుతో రూ.7,09,87,608 మేర అక్రమాలు జరిగినట్లు రుజువు అయింది. దీంతో సొసైటీ పాలక మండలిని రద్దు చేస్తూ కోర్టు ఆదేశాలు జారీచేసింది. దీనితోపా టు సొసైటీలో పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులను కూడా విధుల నుంచి తొలగించాలని ఆదేశించింది.

ఇదే క్రమంలో అక్రమాలకు పాల్పడ్డ సొసైటీ సీఈవో, అధ్యక్షురాలు, కార్యదర్శి, మాజీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యుల నుంచి రూ.7,09,87,608 మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు రికవరీలో భాగంగా వారి వ్యక్తిగత ఆస్తులను అటాచ్ చేసుకోవ చ్చని సూచించింది. సొసైటీ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పకుండా పర్సన్ ఇన్‌చార్జిని నియమించాలని జిల్లా సహకార అధికారికి స్పష్టం చేసింది.

ఆరు నె లల్లోగా సొసైటీకి ఎన్నికలు నిర్వహించి పూర్తి స్థాయి పాలకవర్గాన్ని ఏర్పాటు చే యాలని తీర్పులో సహకార ట్రిబ్యునల్ ఆదేశాలు ఇచ్చింది. సహకార ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రుద్రమదేవి మహిళా సహకార సొసైటీకి అధికారిక కార్య నిర్వాహకురాలిగా జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.దివ్యను నియమించగా ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సొసైటీ కార్యాలయంలో కోర్టు నోటీసులను అధికారులు అతికించారు.

న్యాయ వ్యవస్థను పరిరక్షించుకోవాలి

(5వ పేజీ తరువాయి)

శ్రీనివాసాచారి, వి. శ్రావణ్‌రావుతో పాటు ఇతర న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

న్యాయం అందించడమే లక్ష్యం

ములుగు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రకారం ప్రతి పౌరుడికీ న్యాయం అందించడమే లక్ష్యమని రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్‌సింగ్ అన్నారు. ములుగు జిల్లాకేంద్రంలోని గట్టమ్మ దేవాలయం సమీపంలో నిర్మించనున్న కోర్టు భవనానికి కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్చువల్‌గా ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ కుమార్‌సింగ్ మాట్లాడుతూ పౌరుడి ప్రాథమిక హక్కుల పరిరక్షణే ధ్యేయం కావాలని అన్నారు. వ్యవస్థలోని అన్నివర్గాల సహకారం, వనరుల లభ్యత న్యాయ వ్యవస్థకు ఉందన్నారు. అనంతరం భూమిపూజ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు జస్టిస్ ఈవీ.వేణుగోపాల్, ఎన్.రాజేశ్వర్‌రావు నేరుగా పాల్గొని పునాదిరాయి వేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జస్టిస్ వేణుగోపాల్ మాట్లాడుతూ ములుగు జిల్లాకు న్యాయస్థాన భవన సముదాయం మంజూరు కావడం అభినందించ తగ్గ విషయమని అన్నారు. జస్టిస్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ కోర్టు భవనాలు న్యాయ దేవాలయాలని తెలిపారు. కేసుల్లోని ఇరు వర్గాలకు న్యాయం జరిగేవిధంగా న్యాయవ్యవస్థ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూర్య చంద్రకళ, ఎస్పీ శబరీశ్, సీనియర్ సివిల్ జడ్జి కన్హయ్యలాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాలచారి, ప్రభుత్వ ప్లీడర్ రాంసింగ్, ప్రధాన కార్యదర్శి రంగోజు బిక్షపతి, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేష్, న్యాయవాదులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.